రోడ్డు విస్తరణతో తప్పని తిప్పలు

- డివైడర్ నిర్మాణంతో వాహనదారుల ఇబ్బంది
- సూచికలు లేకుండానే పనులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కొనసాగుతున్న డివైడర్ పనులు

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనుల్లో నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులకు కొత్త చిక్కులు మొదలయ్యాయి. వంద అడుగుల రోడ్డును విస్తరణ చేపట్టేందుకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తుండగా, డివైడర్ పనులు మొదలుపెట్టారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు నిబంధనల మేరకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, అవేమి పాటించకపోవడంతో తరుచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ఇష్టారీతిగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మట్టి కుప్పలు తొలగించాలి

రోడ్డుకు ఇరువైపులా యాభై అడుగుల మేర ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రైనేజీ పక్కన మట్టికుప్పలు పోసి అలాగే వదిలేస్తుండటంతో డివైడర్ నిర్మాణ పనులతో రోడ్డు ఇరుకుగా మారుతోంది. గతంలో పది మీటర్ల తారురోడ్డు ఉండగా, డివైడర్ నిర్మాణంతో అది ఇరువైపులా నాలుగు మీటర్ల మేరకు కుదించుకుపోయింది. తారుపక్కన మట్టి రోడ్డును చదును చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నీటిని చల్లకుండానే రోడ్డు పనులు చేస్తున్నారన్న విమర్శలు రావడంతో నీటిని చల్లడం ప్రారంభించారు. సూచిక బోర్డులు లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

రోడ్డును ఆక్రమిస్తున్న వ్యాపారులు

వంద అడుగుల రోడ్డును వెడల్పు చేసినా పలువురు వ్యాపారులు డ్రైనేజీని, రోడ్డుపై సరుకులు, వస్తువులు ఉంచుతూ రహదారిని ఆక్రమిస్తున్నారు. గతంలో ఆక్రమణలతో వంద అడుగుల రోడ్డు యాభై అడుగులకు కుదించుకుపోగా, ఇప్పుడు సైతం విస్తరణ పనులు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోతోంది. పండుగల వేళ ట్రాఫిక్ రద్దీ పెరగడం, రోడ్డు పనులు, ఆక్రమణలతో ఇబ్బందులు తప్పడం లేదు. విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కనే ఉండటంతో వాటిని తొలగించాల్సి ఉంది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు.

దుమ్ము రాకుండా నీరు చల్లిస్తున్నాం

రోడ్డుపై దుమ్ము లేచి కళ్లలో పడుతుందని తమ దృష్టికి రావడంతో రోడ్డు పక్కన మట్టిపై నీటిని చల్లిస్తున్నాం. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి పనులు చేయాలని సూచించాం. మట్టి కుప్పలను తొలగించి రహదారి నిర్మించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణానికి ముందే డివైడర్ పనులు పూర్తి చేస్తున్నారు.

– శాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్

హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా ఏర్పాటు చేయాలి



వాకర్స్‌తో మాట్లాడుతున్న ప్రణవ్‌బాబు

హుజూరాబాద్ : పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ బాబు మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం పలువురు వాకర్స్ ఆయనతో మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యలను ఆయనకు వివరించారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరిట హుజూరాబాద్ జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రాజేశ్వర్‌రావుతో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ రావడంపై హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి రమేశ్, డాక్టర్ చంద్రమౌళి, సొల్లు దశరథం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల ప్రణవ్‌బాబును ఆయన స్వగృహంలో మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు సదానందం, మ్యాకమల్ల అశోక్, చెన్నవేన రమేశ్, కొండపాక లక్కీ, ఎండీ ఫయాజ్, బండి రోహిత్, తదితరులున్నారు.

మత్తు పదార్థాలు రవాణా చేస్తే చర్యలు

తిమ్మాపూర్: మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ సర్కిల్ ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ అన్నారు. తిమ్మాపూర్, మానకొండూర్, చిగురు మామిడి, గన్నేరువరం మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో 9 లీటర్ల సారా, 11,520 మద్యం బాటిళ్లు, 300 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని 11 మందిని అరెస్ట్ చేశామన్నారు. 55 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. తిమ్మాపూర్, మానకొండూరు, చిగురుమామిడి, గన్నేరువరం తహసీల్దార్ల ముందు మొత్తం 108 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మద్యం, గుడుంబా గంజాయి రవాణా చేస్తే 8712658810 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రమేశ్

జమ్మికుంట: ఎన్నికల నియమావళి పాటించాలని, లేకపోతే ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ బొర్రపటి రమేష్ అన్నారు. శనివారం రాత్రి పట్టణంలో పలుచోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సైలు శ్రీధర్, రాజేశ్, పోలీసులు పాల్గొన్నారు.

'గెలుపే లక్ష్యంగా పనిచేయండి'

మానకొండూర్: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త ఇంటింటా బీజేపీ చేపట్టిన పథకాలు, అభివృద్ధిని వివరించాలన్నారు. కొద్దిరోజులు కష్టపడితే విజయం తమదేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, దూలం కిరణ్, శీలం కుమార్, రమేశ్ పటేల్, సురేశ్, ప్రదీప్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి 'సౌభాగ్యలక్ష్మి'



మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతా రెడ్డి

చిగురుమామిడి: సమాజంలో మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని ఎంపీపీ కొత్త వినీతా రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుందరగిరి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 29న హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం సౌభాగ్యలక్ష్మి పథకాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారన్నారు. బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే రూ.400కే వంట గ్యాస్ అందించనున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద గ్రూపుకు రూ.15 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామోజు రజిత కృష్ణమాచారి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు అందె సుజాత, ఆయాగ్రామాల సర్పంచ్‌లు చెప్యాల మమత, పెద్దపల్లి భవాని అరుణ్‌కుమార్, నాయకురాళ్లు వెంకటలక్ష్మి, కక్కెర్ల లక్ష్మీ, బొల్లి సుమలత, శిరోమణి, రజిత, విజయ, తదితరులు పాల్గొన్నారు.

పోటీపోటీగా ప్రచారం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. శనివారం కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీ కార్డులను ఇంటింటా పంపిణీ చేశారు. అధికారంలోకి వస్తే పార్టీ చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. బీఆర్‌ఎస్ పథకాలపై ఇంటింటా వివరిస్తూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను తెలుపుతూ ప్రచారం నిర్వహించారు.

అభివృద్ధిని గుర్తించి ఆదరించండి

చొప్పదండి: మండలంలోని వెదురుగట్ట తదితర గ్రామాల్లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తించి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చేపూరి సత్యనారాయణ గౌడ్, జొంగోని తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం అడ్డగింత

శంకరపట్నం: మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎన్నికల ప్రచార రథాన్ని దళితకాలనీ వాసులు అడ్డుకున్నారు. మండలంలోని ధర్మారం, కన్నాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో శనివారం మైక్‌సెట్‌తో ప్రచారం చేసేందుకు వెళ్లిన ఆటోను దళిత కాలనీల్లోకి రావద్దని కొందరు అడ్డుకొని వెనక్కి పంపించారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం



మానకొండూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు అన్యాయం జరిగిందని ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు రాసపురి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం నియోజకవర్గం కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ధర్మ సమాజ్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు చిలువేరి శ్రీకాంత్, ఆరెల్లి బాబు, రాజవీరు, నెలవేని శ్రీకాంత్, ఎల్కపల్లి ప్రశాంత్, మాతంగి నవీన్, తాళ్లపల్లి హరీశ్, గోపి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల క్షేత్రస్థాయి సందర్శన

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాలకు చెందిన రైతులు క్షేత్రస్థాయి సందర్శనకు తరలివెళ్లారు. ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ జీడిమెట్లలోని వ్యవసాయ క్షేత్ర సందర్శనకు వెళ్లారు. కూరగాయలు, పండ్లు, పూలమొక్కల పెంపకం, సేంద్రియ ఎరువుల వాడకం, భూసార పరీక్షలతో కలిగే ఉపయోగాలు, నూతన వ్యవసాయ పద్ధతులు, సూక్ష్మనీటి పారుదల పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వారివెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ సిస్టర్ ప్రీత, కో ఆర్డినేటర్ దీప్తి, అరుణ, ప్రతినిధులు మర్రి మల్లేశం, నరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, మౌనిక తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రామడుగు: చొప్పదండి నవోదయ విద్యాలయంలో పదో తరగతిలో ప్రవేశం పొందేందుకు గోపాల్‌రావుపేట పాఠశాలలో 8,9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు శ్రీ రాయుడు, హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై శ్రద్ధచూపాలి

మానకొండూర్: పిల్లల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లల చదువులపై శ్రద్ధ తీసుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మండల విద్యాధికారి మధుసుదనాచారి, శ్యామ్‌రాజ్, కె.శ్రీనివాస్, మమత, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



జమ్మికుంట: శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని మడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లిలో పెద్ద చెరువు మిషన్ కాకతీయ పనులు పూర్తిచేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అధికారులు, పోలీసులు శిలాఫలకం ధ్వంసం చేసిన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పదేళ్లు అధికారంలో ఉన్నా పైసా పనిచేయలే



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

సైదాపూర్: పదేళ్లు హుస్నాబాద్ ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్ ఉండి నియోజకవర్గంలో పైసా పని చేయలేదని మాజీ ఎంపీ, హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో కాంగ్రెస్ బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. నవంబర్ 3లోపు రైతుబంధు ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ సూచిస్తే, తమ పార్టీ రైతుబంధు ఇవ్వదని చెప్పినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ధాన్యం తూకంలో కోత పెడితే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ భారీగా కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో సక్సెస్‌గా అమలవుతున్న కేసీఆర్ పథకం ఒక లిక్కర్ మాత్రమేనని ఏఐసీసీ కార్యదర్శి, ఎన్నికల పరిశీలకుడు క్రిష్టొఫర్ తిలక్ అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను కార్యకర్తలు ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేయాలని క్రిష్టొఫర్ సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి గోపీనాథ్ ఫలనీ అప్పన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్న, మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, కేడం లింగమూర్తి, పత్తి కృష్ణారెడ్డి, గుండారపు శ్రీనివాస్, ఎంపీటీసీలు చాంద్ పాషా, చాడ చైతన్య కొండాల్‌రెడ్డి, మిట్టపల్లి కిష్టయ్య, అన్ని గ్రామాల అధ్యక్షులు, బూత్ కమిటీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. మరోసారి అవకాశమివ్వండి

గంగాధర: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కాకుండా అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసే తనకే మరోసారి అవకాశం ఇవ్వాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని కోట్ల, సర్వారెడ్డిపల్లి, ముప్పిడి నర్సయ్యపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు మేలు చేకూరేలా ఉందన్నారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా అమలు చేస్తామని, పింఛన్లతోపాటు రైతుబంధును పెంచుతామన్నారు. ఇప్పటివరకు ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



పార్టీలో చేరిన యువకులతో బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపు విజయం ఖాయమని హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిర్సపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజల మోసపోవద్దని, ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సదానందం, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

'రసమయి' గెలవాలని ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని మండలంలోని ఇంద్రనగర్ సాయిబాబా ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ హాజరై ఇందిరానగర్ సర్పంచ్ కాటిక వినోద, ఉపసర్పంచ్ దామా అనురాధ, ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు అవుదుర్తి రామకృష్ణ, పలువురితో కలిసి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో గురించి వివరించారు. రసమయిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బేతి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ఇన్‌చార్జి బోయిని తిరుపతి, వార్డుసభ్యులు మాజీ సర్పంచ్ మాజీ గట్టు శ్రీనివాస్ ఉపసర్పంచ్ కవ్వంపల్లి అంజి వార్డుసభ్యులు కూన శ్రీనివాస్, అలువాల శంకర్ గంగిపల్లి సంపత్, రమేశ్, వెంకటేశ్, రాజశేఖర్, లక్ష్మణ్, సాయికుమార్, సదానందం, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వొడితెల ప్రణవ్‌బాబును ప్రకటించడంపై పట్టణంలోని గాంధీచౌక్, కొత్తపల్లి, రామన్నపల్లిలో ఆ పార్టీ నాయకులు శనివారం పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సజ్జద్ మహమ్మద్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకరి రమేశ్, శ్రీనివాస్, సతీశ్ రెడ్డి, రవి, దౌలత్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పర్వేజ్, నవీన్, ప్రణయ్, సాగర్, రమేశ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో పల్లకి సేవ



చొప్పదండి: పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకొని పల్లకి సేవ నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసిన భక్తులు చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నమే పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు అమ్మవారి ఫొటోతో ఉన్న డాలర్, పసుపు, కుంకుమలను పంపిణీ చేశారు. అర్చకులు సింహాచలం జగన్‌మోహన్ స్వామి, భాష్యం నవ్యకుమార్, అభిరాం శర్మ భక్తులకు ఆశీర్వాదాలు అందించారు.

క్లుప్తంగా

నియామక పత్రాలు అందజేత

జమ్మికుంట: మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ కాంగ్రెస్ కమిటీ సభ్యుల నియమక పత్రాలను పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. పట్టణ ఉపాధ్యక్షుడిగా పోతుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు రాజమౌళి, కార్యదర్శులుగా గుర్రపు మురళి, ఎండీ సలీం, సహాయ కార్యదర్శిగా లింగంపల్లి లింగారావు, ముఖ్య సలహాదారులుగా పందిళ్ల శంకర్‌కు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని 30 వార్డుల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజలకు వివరిస్తూ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. పట్టణ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు గొట్టె ప్రభుదాస్, నాయకులు నాగేంద్ర, రమేశ్, సమ్మయ్య, సమ్మయ్య, మహేందర్, జక్కె లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

హుజూరాబాద్ : పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో కమలాపూర్‌కు చెందిన నాయీ బ్రాహ్మణులు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కమలాపూర్ నాయీ బ్రాహ్మణ అధ్యక్షుడు రాంబాబు, పలువురు, తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

మానకొండూర్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని సదాశివపల్లి స్టేజీ సమీపంలో పాలస్తీనాకు సంఘీభావంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. తక్షణమే దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు సీహెచ్ భద్రయ్య, గట్టు సతీశ్, ఎస్.రమేశ్, ఎలిమి రమేశ్, గంజాల గోపి, పిట్టల సంపత్, కొమురయ్య, మల్లారెడ్డి ప్రతాపరెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో నేడు ఎన్నికల ప్రచారం

చిగురుమామిడి: మండలంలోని ఐదు గ్రామాల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యే, అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని బీఆర్‌ఎస్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మామిడి అంజయ్య తెలిపారు. శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు రేకొండ, 11.30 గంటలకు బొమ్మనపల్లి, మధ్యాహ్నం 1 గంటకు సుందరగిరి, 4 గంటలకు ఉల్లంపల్లిలో, సాయంత్రం 5 గంటలకు కొండాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, యువకులు, మహిళలు, హాజరై విజయవంతం చేయాలని మామిడి అంజయ్య కోరారు.

'చర్యలు తీసుకోవాలి'

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామంలోని సర్వే నెంబర్ 437, 438 ప్రభుత్వ భూమిలో హరితహారంలో నాటిన ఈత చెట్లను కొందరు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు శనివారం తహసీల్దార్ కనుకయ్యకు ఫిర్యాదు చేశారు. రాజకీయ అండదండలతో ఓ నాయకుడు ధ్వంసం చేసి కబ్జా చేస్తున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, 560 జీవో ప్రకారం గీత కార్మికులకు అందించాలన్నారు. మార్క రాజయ్య, ఎల్లయ్య, రాజు, రాజయ్య, మల్లేశం, నర్సయ్య, వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

30 నుంచి జీవాలకు టీకాలు

రామడుగు: మండలంలో ఈనెల 30వ తేదీ నుంచి గొర్రెలకు పీపీఆర్ (పారుడు రోగ నిరోధక) టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. 30న, రామడుగు, 31న, కోరటపల్లి, నవంబర్ 1, రాంచెంద్రాపూర్, 2న వెదిర, 3న కొక్కెరకుంట, 4న గుండి, 6న పందికుంటపల్లి, 7న వెలిచాల, 9న దేశరాజ్‌పల్లి 10న దత్తోజీపల్లి, 11న వెంకట్రావుపల్లి 13న వన్నారం, 14న కిష్టాపూర్, 15న రుద్రారం, 16న రంగసాయిపల్లి, 17న గోపాల్‌రావుపేట 18న తిర్మలాపూర్ 19న లక్ష్మీపూర్, 20న పలు గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

'హామీలతో ఒరిగేదేమీ లేదు'

ఇల్లందకుంట : హామీలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు గెలిచిన వెంటనే మండల అభివృద్ధికి సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మోత్కురి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నా నాయకులకు పట్టింపులేదని, నిత్యం కార్యాలయాలకు వచ్చే ప్రజలు సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు నిర్మించడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

శంకరపట్నం : మండలంలోని కేశవపట్నం, కరీంపేట చెరువుల్లో శనివారం ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ చేపపిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మత్స్యకారులకు 2లక్షల 50వేల చేపపిల్లలు ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. రవి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.